
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

శుక్రవారం, 29 నవంబరు 2024

5

ఎన్డీ దళకమాండర్ రమేశ్ అరెస్టు?

- అనారోగ్యంతో బాధపడుతుండగా పట్టుకెళ్లిన మఫ్టీ పోలీసులు



ఇల్లెందు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): న్యూడెమోక్రసీ ఇల్లెందు ఏరియా అజ్ఞాత దళక మాండర్ పూనెం రమేశ్‌బాబు అలియాస్ రమేశ్ అలియాస్ వినోద్‌ను గురువారం పోలీసులు అరెస్టు చేసినట్టు సమాచారం. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమేశ్... ఇల్లెందు మండలం ఎల్లాపురం గ్రామంలో విశ్రాంతి తీసుకుంటుండగా పోలీసులు మఫ్టీలో కారులో వచ్చి అరెస్టు చేసి తీసుకువెళ్లారని కుటుంబసభ్యులు తెలిపారు. గత రెండున్నరేళ్లుగా న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాల్లో ఉంటున్న రమేశ్... యతీంద్రకుమార్ నాయకత్వంలోని న్యూడెమోక్రసీకి జిల్లా కార్యదర్శిగా ఉన్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసుల చర్యను నిరసిస్తూ కొమరారం తదితర గ్రామాల్లో పార్టీ నాయకులు, శ్రేణులు ఊరేగింపులు జరిపారు. రమేశ్‌కు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపరచాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాజీ జడ్పీటీసీ చంద్ర అరుణ, సీపీఐ మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయని రాజు డిమాండ్ చేశారు. కాగా న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు, జిల్లా నాయకులు కొక్కు సారంగపాణి, తుపాకుల నాగేశ్వరావు, చిరంజీవి తదితరులు రమేశ్ అరెస్టును ఖండించారు. వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు.

జయ జయహే తెలంగాణ..



ఉద్యమాగ్ని రగిలించిన నేల

- నాడు కేసీఆర్ ఆమరణ దీక్షకు కేంద్రంగా నిలిచిన ఖమ్మం
- కరీంనగర్‌లో అరెస్టు చేసి జిల్లా జైలుకు తరలింపు
- దీక్ష కొనసాగించడంతో జిల్లా ఆసుపత్రికి తరలింపు
- కేసీఆర్‌కు బాసటగా నిలిచిన పార్టీలు, ప్రజాసంఘాలు
- తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిన ఖమ్మం దీక్ష
- నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ నేడు బీఆర్‌ఎస్ దీక్షాదివస్

ఖమ్మం, నవంబరు 28 (ఆంధ్రజోతి ప్రతినిధి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఖమ్మం మరపురాని మజిలీగా నిలిచింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా నాడు కేసీఆర్ సాగించిన ఆమరణ నిరాహార దీక్షకు ఖమ్మం కేంద్రంగా నిలిచింది. 2009 నవంబరు 29న "తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో" అన్న నినాదంతో కరీంనగర్‌లో ఆమరణదీక్షకు దిగిన కేసీఆర్‌ను పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. ఈ క్రమంలో జైల్లోనే కేసీఆర్ ఆమరణదీక్ష కొనసాగించగా ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో అప్పటి వరకు జిల్లాలో నామ మాత్రంగా ఉన్న తెలంగాణ ఉద్యమం ఒక్కసారిగా ఊపందుకుంది.

కదిలిన జనం..

నాడు కేసీఆర్ దీక్షకు ఉమ్మడి జిల్లాలో పలు పార్టీలు, సంఘాలు బాసటగా నిలిచాయి. ఖమ్మం జిల్లాకు చెందిన బొమ్మెర రాంమూర్తి (మిగతా 6వ పేజీలో)

చరిత్రను మలుపు తిప్పిన రోజు

- ఖమ్మం, కొత్తగూడెంలో నేడు దీక్షా దివస్
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం 2009 నవంబరు 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిందని, ఆ రోజును గుర్తు చేసుకుంటూ శుక్రవారం ఖమ్మం, కొత్తగూడెంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలిపారు. ఖమ్మంలోని జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మంలో దీక్షా దివస్‌కు బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఇన్‌చార్జ్‌గా ఉంటారని, కొత్తగూడెంలో నిర్వహించే కార్యక్రమానికి వద్దిరాజు రవిచంద్ర (మిగతా 6వ పేజీలో)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు



పొలం సిద్ధం చేస్తున్న రైతు

యాసంగి అరకల సందడి

- నాగార్జునసాగర్ ఆయకట్టులో అన్నదాతల పొలంబాట
- ఎడమకాల్వ కింద జోరుగా నారుమళ్లు
- మరోవైపు దుక్కులకు నీళ్లు
- డిసెంబరులోగా నార్లు పోసుకోవాలి: వ్యవసాయ అధికారులు
- పలుచోట్ల ఇంకా కొనసాగుతున్న ఖరీఫ్ వరి కోతలు

కూసుమంచి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఆయకట్టులో రైతాంగం యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు. వానాకాలం సాగు సరైన సమయంలో అదునులోనే మొదలుపెట్టిన రైతులు... ప్రస్తుతం వరికోతలు కోస్తుండగా, ఇప్పటికే కోతలు పూర్తయిన రైతులు యాసంగి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దుక్కులకు నీళ్లు పెట్టి నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఒకవైపు కోతలు, కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు ముమ్మరంగా సాగుతుండగా, మరోవైపు యాసంగి నారుమళ్లకు సిద్ధమవుతున్నారు.

ఖమ్మంజిల్లాలో సాగర్ ఆయకట్టు కింద సుమారు 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. వానాకాలంలో ఆయకట్టు ఆసాంతం సాగుచేశారు. వానాకాలంలో భారీ వర్షాలు పడటం, సాగర్ ఎడమకాల్వకు మొదటిజోన్ పరిధిలో కాగిత రామచంద్రాపురం వద్ద, రెండోజోన్ పరిధిలో కూసుమంచి మండలం హట్యాతండ వద్ద గండ్లు పడటం లాంటి ఘటనలతో రైతులు సాగునీటికి కొంత ఇబ్బంది పడ్డారు. సరైన సమయంలో సాగునీరందక కొన్ని ప్రాంతాల్లో వరి ఎండిపోయింది. మరికొన్ని చోట్ల దిగుబడిపై ప్రభావం చూపిందని అంటున్నారు.

ప్రస్తుతం నాగార్జునసాగర్ డ్యాంలో 584 అడుగులమేర నీరు సంవృద్ధిగా ఉండటంతో, యాసంగికి పుష్కలంగా సాగునీరు వస్తాయని భరోసాలో రైతులు ఉన్నారు. ఇప్పటికే నార్లుపోసి 20రోజులు దాటింది. కొంత ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు జరుగుతున్నాయి. వారు ఒకమడిని దున్ని నారు పోసుకుంటున్నారు. రైతాంగం పొలం బాట పట్టడంతో యాసంగినీరు విడుదల చేయడం ప్రభుత్వానికి తప్పనిసరి కానుంది. దీనికితోడు వచ్చే ఏడాది స్థానికసంస్థల ఎన్నికలు జరుగనుండటంతో ప్రభుత్వం యాసంగి ప్రణాళికను ప్రకటించక తప్పదు.

వరివైపే రైతుల చూపు

జిల్లాలో యాసంగి సాగులో భాగంగా వరి సాగువైపే ఎక్కువగా (మిగతా 6వ పేజీలో)



నగరంలో విద్యార్థుల భారీ ప్రదర్శన

ఈ 'భోజనం' మాకొద్దు..

- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన
- ఖాళీ ప్లేట్లతో నగరంలో రెండుచోట్ల ధర్నా
- నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని ఆరోపణ
- చర్యలు తీసుకుంటామన్న డీఈవో

ఖమ్మం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న 'మధ్యాహ్న భోజనం' తీరుపై విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు కన్నెర్ర చేశారు. పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భోజనం ప్లేట్లతో నిరసన తెలుపుతూ రెండు చోట్ల ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని ఎన్నెస్పీ క్యాంప్ పాఠశాల వద్ద ప్రోగ్రెసివ్ డెమోక్రాటిక్ స్టూడెంట్స్ యూనిటీ (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో లంచ్‌బాక్స్‌లు, భోజనపు ప్లేట్లతో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం 'వుయ్ వాంట్ క్వాలిటీ మిడ్ డే మీల్స్' అంటూ నినాదాలు చేస్తూ ఎన్నెస్పీ క్యాంప్‌నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. అలాగే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఇందిరానగర్ హైస్కూల్ వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో...

నగరంలోని ఎన్నెస్పీ పాఠశాలలో మెనూ ప్రకారం కాకుండా నీళ్లచారు, ఉడకని కూరగాయలతో భోజనం అందించారని ఆ పాఠశాల విద్యార్థులు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భోజనం ప్లేట్లతో ధర్నా నిర్వహించారు. 2 గంటలపాటు ధర్నా జరగ్గా సమాచారం అందుకున్న జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు మరలా భోజనం పెట్టించారు. మెనూ ప్రకారం ఆహారం ఇవ్వని ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కలుషిత ఆహారం అందిస్తున్న ఘటనలపై హైకోర్టు స్పందించినా ప్రభుత్వ స్పందించటం లేదని విమర్శించారు. ఇటీవల కలుషిత ఆహారంతో శైలజ అనే విద్యార్థిని మృతిచెందిందని, తాజాగా మగనూరు (మిగతా 6వ పేజీలో)



విశాఖ నుంచి పాదయాత్రగా వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

విశాఖ నుంచి భద్రాద్రికి పాదయాత్ర

- బాబు సీఎం కావాలని గతేడాది మొక్కుకున్న కార్పొరేటర్
- ఈ నెల 20న పాదయాత్ర ప్రారంభం
- 270 కి.మీ. నడిచి అశ్వారావుపేటకు చేరిక
- స్వాగతం పలికిన స్థానిక టీడీపీ నాయకులు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జైలు నుంచి విడుదలై, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేస్తే భద్రాచలం రాములవారి సన్నిధికి పాదయాత్రగా వస్తామని మొక్కుకున్న విశాఖ జిల్లా గాజువాక ప్రాంతానికి చెందిన 20మంది తెలుగుదేశం నాయకులు... గురువారం రాత్రి అశ్వారావుపేటకు చేరుకున్నారు. గతేడాది సెప్టెంబరు 9న చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ విశాఖ నగర 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి 21న నల్లదుస్తులు ధరించి రోజంతా ఉపవాసం ఉన్నారు. అదే సమయంలో చంద్రబాబు సీఎం అయితే భద్రాచలం వస్తామని మొక్కుకున్నారు.

ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు సీఎం కావటంతో గోవిందరెడ్డి తన అనుచరగణంతో ఈనెల 20న ఉదయం ఆరు గంటలకు విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గం తుంగలాం గ్రామంలో విజయరాఘవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. పదిరోజుల పాటు దాదాపు 270కిలోమీటర్ల మేర నడిచి గురువారం రాత్రి అశ్వారావుపేట చేరుకున్నారు. పాదయాత్ర బృందానికి స్థానిక (మిగతా 6వ పేజీలో)

పగ్గాలు దక్కేది ఎవరికో!?

- భద్రాద్రి దేవస్థానం పాలక మండలి కూర్పుపై భక్తుల ఆసక్తి
- ఆధ్యాత్మిక భావన, అభివృద్ధి చింతన కలిగిన వారికి అవకాశం ఇవ్వాలి
- తిరుమల తరహాలో సరిహద్దు రాష్ట్రాలకూ ప్రాధాన్యమివ్వాలి
- మరపురాని సేవలందించిన తొలితరం చైర్మన్ కల్లూరి చంద్రమౌళి
- ఆయన హయాంలోనే వాగ్గేయకారోత్సవాలు, ముక్కోటి తెప్పోత్సవాలకు శ్రీకారం
- అభినవ రామదాసులుగా మారాలని భక్తుల ఆకాంక్ష



భద్రాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పాలక మండలి ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసిన నేపథ్యంలో పాలక మండలిలో భక్తి, ఆధ్యాత్మిక భావాలతో వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులకు చోటు కల్పించాలని భక్తులు, భద్రాద్రివాసులు కోరుతున్నారు. భద్రాద్రి పాలకమండలి రాజకీయ పునరావాస కేంద్రంగా కాకుండా దేవస్థానం ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసి, అభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని కోరుతున్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన భద్రాద్రి రామాలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలో భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వడంతోపాటు శీఘ్ర దర్శనం అందేలా కృషి చేసేందుకు పాలక మండలి ఎంతో అవసరమని భక్తులు అభిప్రాయపడుతున్నారు. అంతే కాకుండా దేవస్థానం పరిధిలో భక్తులకు వసతి కల్పించేందుకు ఆశించిన స్థాయిలో సత్రాలు, కాటేజీలు లేకపోవడంతో వాటిపై ప్రధానంగా దృష్టిసారించేలా ప్రముఖులకు పాలకమండలి చైర్మన్ పగ్గాలు అప్పగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని భక్తులు భావిస్తున్నారు.

సరిహద్దు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి తరహాలో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పాలక మండలిలోనూ సరిహద్దు రాష్ట్రాల నుంచి ఆధ్యాత్మిక భక్తి భావనతో పాటు ఆలయాభివృద్ధికి కృషి చేస్తారని భావించే వారికి అవకాశం కల్పిస్తే ఆలయ అభివృద్ధికి దోహదపడుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. భద్రాద్రికి సరిహదున ఉన్న చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుండటంతో ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రముఖులకు పాలక మండలిలో చోటు కల్పిస్తే ఆలయాభివృద్ధికి ఊతమిస్తుందనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

నాడు అభివృద్ధే ధ్యేయంగా...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1959 జూన్ ఒకటిన భద్రాద్రి దేవస్థానం దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. నాడు రామాలయం జీర్ణోద్ధరణ పనులు చేపట్టేందుకు అప్పటి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి తన మంత్రి పదవికి రాజీనామా చేసి రామాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఆ పనులను (మిగతా 6వ పేజీలో)



ఆర్ఎంపీ ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో తదితరులు

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా వైద్యం
- తనిఖీల్లో గుర్తించిన డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అది ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాల్సిన కేంద్రం. కానీ యథేచ్ఛగా 6 పడకలను ఏర్పాటు చేసి ఓ ఆర్ఎంపీ వైద్యశాలను నిర్వహిస్తూ జిల్లా వైద్యాధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. అంతేకాదు అక్కడ అబార్షన్లు జరుగుతున్నట్టు కూడా ఆరోపణలున్నాయి. జిల్లా వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో కొత్త బస్టాండు సమీపంలో అజయ్ అనే ఆర్ఎంపీ కొన్ని రోజులుగా 6పడకలను ఏర్పాటు చేసి ఇష్టారీతిగా వైద్యాన్ని నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.కళావతిబాయి తన వైద్యాధికారుల బృందంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఆర్ఎంపీ 6 బెడ్లను ఏర్పాటు చేసి వైద్యాన్ని అందిస్తున్నట్టు గమనించారు. కనీసం ఇంజక్షన్ వేయడానికి అర్హత లేని ఆర్ఎంపీ ఇలా ఏకంగా బెడ్లను ఏర్పాటు చేసి వైద్యాన్ని నిర్వహిస్తుండడంతో సదరు ఆర్ఎంపీని తీవ్రంగా మందలించారు. వెంటనే ఆస్పత్రిని సీజ్ చేశారు. అంతే కాదు దీనికి అనుసంధానంగా ఉన్న మెడికల్ షాపులోనూ తనిఖీలు నిర్వహించారు. ఫ్రీజింగ్ చేయాల్సిన మందులను ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్న తీరుపై మందలించి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు సమాచారాన్ని అందించారు.

హెర్బల్ క్లినిక్‌పైనా దాడులు

నగరంలోని ఆర్‌జేఆర్ హెర్బల్ క్లినిక్‌లోనూ డీఎంహెచ్‌వో తనిఖీలు నిర్వహించారు. అక్కడి రోగులతో మాట్లాడారు. అనంతరం క్లినిక్ యాజమాన్యంతో మాట్లాడి రోగులకు హోమియో వైద్యాన్ని మాత్రమే చేయాలని (మిగతా 6వ పేజీలో)

పగ్గాలు దక్కేది ఎవరికో!?

(5వ పేజీ తరువాయి)

విజయవంతంగా పూర్తి చేశారు. భద్రాద్రి దేవస్థానానికి ఇప్పటి వరకు 13సార్లు పాలక మండళ్లు ఏర్పాటు చేయగా అల్లూరిమూర్తిరాజుకు ఛైర్మన్‌గా మూడుసార్లు పని చేసే అవకాశం లభించడం విశేషం. ఆయన ఛైర్మన్‌గా ఉన్న సమయంలో దేవస్థానంలో వాగ్గేయకారోత్సవాలకు శ్రీకారం చుట్టడమే కాకుండా దేశంలోని ప్రముఖ సంగీత విద్వాంసులైన డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, హిందుస్థానీ శాస్త్రీయ సంగీత ప్రముఖులు పండిత్ హరిప్రసాద్ చౌరాసియా, ప్రముఖ మృదంగ విద్వాంసులు ఎల్లా వెంకటేశ్వరరావు, ఎంఎస్ సుబ్బలక్ష్మి, అన్నమాచార్య గాయని శోభరాజు వంటి ప్రముఖులను తీసుకువచ్చి కచేరీలు నిర్వహించారు. అనంతరం వచ్చిన ఏ ఛైర్మన్ కూడా ఈ రీతిన సంగీత విద్వాంసులను తీసుకొచ్చిన దాఖలాలు లేవు.

అదేవిధంగా ప్రతి ఏటా నిర్వహించే వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి తెప్పోత్సవాన్ని గోదావరిలో హంసాలంకృత తెప్పతో నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన ఛైర్మన్ కూడా ఆయనే కావడం విశేషం. అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి, ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దాతల సహకారంతో వంద గదుల సత్ర నిర్మాణం చేపట్టేందుకు నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయగా దానికి సైతం అల్లూరి మూర్తిరాజు ఛైర్మన్‌గా కీలక బాధ్యతలు నిర్వహించి ఆ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. అలాగే ఆయన ఛైర్మన్‌గా ఉన్న సమయంలో తానే స్వయంగా కాటేజీని నిర్మించడమే కాకుండా ఇతర దాతలు వచ్చేలా ప్రోత్సహించారు.

రామాలయ ప్రతిష్ట

రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్దకాలం దాటినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పాలక మండలి ఏర్పాటులో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతున్న క్రమంలో భద్రాద్రి దేవస్థానానికి పాలక మండలి ఏర్పాటుకు మార్గం సుగమం చేయడంతో త్వరలో నూతన పాలక మండలి కొలువుదీరనుంది. అయితే ఇప్పటికే అధికార పార్టీకి చెందిన నాయకులు తమదైన శైలిలో పాలక మండలిలో చోటు కోసం ప్రయత్నాలు సాగిస్తుండగా ఆధ్యాత్మిక, భక్తి భావం ఉన్న వారు సైతం తమవంతు ప్రయత్నాలను చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పాలకమండలిలో రాజకీయ నాయకులకే అధిక ప్రాధాన్యమివ్వకుండా వివిధ రంగాల్లో ప్రముఖులను గుర్తించి వారికి కూడా అవకాశం కల్పించి పాలక మండలికి మరింత వన్నెతేవాలని భద్రాద్రివాసులు, రామ భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

'సింగరేణి' అభివృద్ధిలో కార్మికసంఘాల పాత్ర కీలకం

- ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులతో సమావేశం..
- సింగరేణి ఛైర్మన్ బలరాం



కార్మిక సంఘనాయకులతో మాట్లాడుతున్న సింగరేణి అధికారులు

కొత్తగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధిలో, ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మికసంఘాల పాత్ర కీలకమని, సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. గురువారం కొత్తగూడెం, ఇల్లెందు క్లబ్‌లో గుర్తింపు కార్మికసంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వి.సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కే.రాజ్‌కుమార్, ఇతర 9ఏరియాల నాయకులతో 50వ నిర్మాణాత్మక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం మాట్లాడుతూ ఏఐటీయూసీ గుర్తింపుసంఘంగా ఎన్నిక అయ్యాక జరుగుతున్న తొలి, సంస్థలో 50వ నిర్మాణాత్మక సమావేశం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ఏవిధంగా ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించారో ఇక ముందు కూడా సహకరించాలని కోరారు. అనంతరం సింగరేణి డైరెక్టర్ పీఅండ్‌పీ (పా) జి. వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన ఉద్యోగుల డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఎన్‌సీడబ్ల్యూఏ పరిధిలోకి రాని అన్ని అలవెన్సులు పెంచాలని, కార్మికులందరికి కొత్త ఇన్సెంటివ్ పాలసీని ప్రవేశపెట్టాలని, ప్లేడేస్, పీహెచ్‌డీల్లో ఎస్-1 పాలసీని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 2000ర్యాంక్‌తో సంబంధం లేకుండా ప్రసుత్త మెరిట్ స్కాలర్‌షిప్ 57స్లాట్లకు చెల్లించాలని, మెరిట్, స్కాలర్ షిప్‌ను రూ.50,000కు పెంచాలని, కోల్ బెల్టు ఏరియాలో ఉన్న రామగుండంలోని మెడికల్ కాలేజీలో సింగరేణీయన్లకు 25శాతం ఎంబీబీఎస్ సీట్లు రిజర్వు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్నఅన్ని డిపెండెంట్ ఉద్యోగ కేసులతో సహావంచన, విజిలెన్స్ కేసుల్లో జప్తుచేయబడిన మొత్తాన్ని సమీక్షించి క్లియర్ చేయాలని, మెషిన్‌మైనింగ్, సెమి మెకనైజ్డ్ మైనింగ్ విభాగాలకు ట్రేడ్‌మెన్ హెల్పర్లను కేటాయించాలని, యూజీ పనిలో ట్రేడ్స్‌మెన్ కోసం అధికార పరిధిని నిర్వహించాలని తదితర అంశాలపై త్వరలో సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని సింగరేణి డైరెక్టర్ పీఅండ్‌పీ (పా) వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జీఎం (పర్సనల్) ఐఆర్‌అండ్‌పీఎం కవితా నాయుడు, జీఎం (ఐఈ) టి.సురేష్‌బాబు, జీఎం (ఫైనాన్స్) ఎం.సుబ్బారావు, జీఎం (యూజీమైన్స్) వై. రఘురాంరెడ్డి, జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కే. శ్రీనివాసరావు, ఎసీఎంవో ఎం. ఉష, డీజీఎం (పర్సనల్) ఐఆర్ వింగ్ కే. అంజయ్‌కుమార్, రాజగోపాల్, తర అధికారులు గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వంగ వెంకట్, ఉప ప్రధానకార్యదర్శులు కే. సారయ్య, వైవి. రావు, మడ్డి ఎల్లాగౌడ్, కందికట్ల వీరభద్రం, ముస్కే సమ్మయ్య, నాయకులు వై. రాంగోపాల్, అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి భద్రాద్రికి పాదయాత్ర

(5వ పేజీ తరువాయి)

తెలుగుదేశం నాయకులు నార్లపాటి ఆధ్వర్యంలో నాయకులు ఘనస్వాగతం పలికారు. గోవిందరెడ్డికి శాలువాకప్పి సత్కరించారు. అనంతరం రాష్ట్రీయ రహదారిపై రింగ్‌రోడ్ సెంటర్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ ఏపీ రాష్ట్రంలో సుభిక్షపాలన నడుస్తోందని, సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడంతో తమ మొక్కులను చెల్లించుకుంటున్నామని తెలిపారు. మరో మూడు రోజుల్లో భద్రాచలం చేరుకుంటామని, రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటామని తెలిపారు. పాదయాత్రలో గోపిశెట్టి దేవుడు, వరాల రాజు, కోన హరి, నీలాపు అప్పలరాజు, అప్పారావు, నర్సింగుతోపాటు నాయకులు, స్థానిక తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

గురుకులాల తనిఖీ

సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



అన్నపురెడ్డిపల్లిలో గరుకులాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నపురెడ్డిపల్లిలోని సాంఘీకసంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ గురుకులాలను గురువారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో వంటగదులు, డార్మెట్రీ, ఆహారపదార్థాలు, పరిసరాలు, పరిశుభ్రతను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజన సమయంలో తీసుకోవాల్సిన చర్యలను, పదార్థాల నాణ్యత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఆహారంలో కల్తీ ఘటనలను ఉదహరిస్తూ గరుకులాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. లీగల్ సర్వీసెస్ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, అవకాశాలను వినియోగించుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. అంతకుముందు స్థానిక శివాలయంలో భానుమతి పూజలు చేశారు. ఈకార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు నిరంజన్, ప్రిన్స్‌పాల్‌లు రాధాకృష్ణమూర్తి, ఎన్ చైతన్య, బురాన్‌లు వున్నారు.



మాట్లాడుతున్న ఏటీడీవో జహీరుద్దీన్

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

మూలపోచారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏటీడీవో జహీరుద్దీన్

ఏన్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని ఏటీడీవో జహీరుద్దీన్ ఆదేశించారు. గురువారం మండలంలోని మూలపోచారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వసతిగృహ సంక్షేమ అధికారులకు, ఆశ్రమ పాఠశలల్లో డిప్యూటీ వార్డెన్లు, వంట సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. హాస్టల్ నిర్వహణ, నూతన పద్ధతుల్లో రుచికరమైన వంటలు తయారు చేయడం, పరిసరాల పరిశుభ్రత పాటించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఏటీడీవో, మండల వైద్యాధికారి రాములు పాల్గొని వారికి పలుసూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వంటగది, డ్రెయినేజీ, మరుగుదొడ్ల ప్రాంగణంలో బ్లీచింగ్, ఫినాయిల్, యాసిడ్లను ఉపయోగించాలన్నారు. స్టోరేజ్‌లో నిలవ ఉన్న ఆహార పదార్థాలను వారానికి మూడుసార్లు క్లీన్‌చేయాలని, కూరగాయలు ఎక్కువ రోజులు నిల్వ చేయవద్దని, వంట సిబ్బంది తప్పనిసరిగా ఎప్రాన్లు, హెడ్‌క్యాప్, గ్లోవ్స్ ధరించాలన్నారు. బియ్యం వండేటప్పుడు అప్రమత్తంగా ఉండి ఒకరోజు ముందే శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జి.నాగరాజు, రమేష్, వెంకటరమణ, ధర్మ, శ్రీనివాస్, శ్రీనివాసరావు, వార్డెన్లు హెచ్‌డబ్ల్యూవోలు బి.రవి, బి.నెహ్రూ, నరసింహారావు, వసంత, అపర్ణ, వీరన్న, వెంకటేశ్వర్లు, జనార్ధన్‌రావు, నాగేశ్వరరావు, శ్యామల, సింగ్యా, నాగేశ్వరరావు, రమేష్, ఉషశ్రీ పాల్గొన్నారు.

ఈ 'భోజనం' మాకొద్దు..

(5వ పేజీ తరువాయి)

జడ్పీ పాఠశాలలో మధ్యాహ్నభోజనం తిని 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఆర్థిస్థోమత లేని పేదలు తమ పిల్లలను మంచి భవిష్యత్‌కోసం ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తుంటే అక్కడ నాణ్యమైన భోజనం అందించకుండా వారి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని విమర్శించారు. అన్నంలో పురుగులు రావటం, ఆహారంలో కల్తీ జరిగి అస్వస్థతకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్లక్ష్యంగా వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, పృధ్వి, కావ్య, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఇందిరానగర్ హైస్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ.ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రోజుకో జిల్లాలో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నాసిరకం భోజనం వల్ల ఆహారం కలుషితమై విద్యార్థులు పిట్టల్లా రాలిపోతుంటే పట్టించుకోకపోవటం దారుణమన్నారు. వంకిడిలో కలుషితాహారంతో విద్యార్థిని మృతిచెందినా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నగర ఉపాధ్యక్షుడు వినోద్, మహేష్, వీరేందర్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిని బాధ్యతగా స్వీకరించండి

కిష్టారం పాఠశాలను సందర్శించిన జడ్పీ సీఈవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జడ్పీ సీఈవో దీక్ష

సత్తుపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావ ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిని సంస్థ బాధ్యతగా స్వీకరించాలని జడ్పీ సీఈవో దీక్ష అన్నారు. గురువారం ఆమె సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో ఆకస్మికంగా పర్యటించిన ఆమె ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్నం సమయం కావడంతో విద్యార్థులతో కలిసి మిడ్డే మీల్స్ రుచిచూశారు. అనంతరం తరగతి గదులు, పాఠశాల పరిసరాలు, ఆవరణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కోతుల బెడద ఎక్కువగా ఉన్నందున నివారణకు చర్యలు తీసుకోవాలని కోరగా స్పందించిన ఆమె సింగరేణి పీవోను ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంఈవో రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు సయ్యద్ సమద్, మహ్మద్ రియాజుద్దీన్, రత్నాకర్, వెంకటేశ్వరరావు, కళావతి, నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పోటు ప్రసాద్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి పువ్వాడ, ఆయన సతీమణి వసంతలక్ష్మి

పోటు ప్రసాద్ మృతి జిల్లా రాజకీయాలకు తీరనిలోటు

ఖమ్మంటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మరణం జిల్లా రాజకీయాలకు తీరనిలోటని మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మమతా ఆసుపత్రిలోని పోటు ప్రసాద్ భౌతిక కాయానికి ఆయనసతీమణి వసంతలక్ష్మితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రాజకీయాల్లో పోటు ప్రసాద్ చెరగని ముద్ర వేశారన్నారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గురువారం పోటు ప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శించారు. సతీమణి నిర్మల, తల్లి సక్కుబాయి, సోదరుడు,సోదరీమణులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఖార్సైన కమ్యూనిస్టు పోటు ప్రసాద్ అని, ఆయన జీవితం నేటితరానికి ఆదర్శమన్నారు.

జంట హత్యల నిందితుల కోసం వేట

- ఏడు బృందాలతో గాలిస్తున్న పోలీసులు
- వ్యక్తిగత కక్షలా..? వ్యాపారా తగదాలా..?
- హత్యల వెనుక కారణాలపై పోలీసుల దర్యాప్తు
- పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆరా తీసిన సీపీ సునీల్‌దత్

నేలకొండపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలో వృద్ధ దంపతులు యర్రా వెంకటరమణ, కృష్ణకుమారి దారుణహత్యకు గురైన ఘటన పోలీసులకు పెను సవాల్‌గా మారింది హత్య చేసిన వారు ఇంట్లో నుంచి ఎటువంటి నగలు, నగదు ఎత్తుకెళ్లక పోవటంతో దొంగతనం కోసం హత్యలు జరగలేదనేది స్పష్టంగా తెలుస్తోంది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు సాధ్యమైనంత త్వరగా కేసును ఛేదించాలన్న పట్టుదలతో ముందుకు పోతున్నారు. అసలు హత్యలకు కారణాలేంటి... వ్యక్తిగత కక్షలా?వ్యాపారం చేసిన సమయంలో ఉన్న తగాదాలా..? ఇంకేమైనా కారణాలా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ బృందాలతోపాటుగా మొత్తం ఏడు బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయి.

హత్యాస్థలంలో దొరికిన ఆధారాలను క్రోడీకరిస్తూ మరిన్ని సాక్ష్యాల కోసం పోలీసులు కృషి చేస్తున్నారు. కేసు పురోగతిని పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గురువారం ఖమ్మం సీపీ సునీల్‌దత్ నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు దర్యాప్తు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసును సాధ్యమైనంత త్వరగా ఛేదించాలని ఆదేశించారు. రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి, ముదిగొండ, కారేపల్లి సీఐలు, నేలకొండపల్లి ఎస్ఐతోపాటుగా కూసుమంచి, తిరుమలాయపాలెం, కారేపల్లి ఎస్ఐలు జంట హత్యల కేసు దర్యాప్తులో పాల్గొంటున్నారు. కాగా, జంట హత్యల కేసులో పురోగతి ఉన్నదని నిందితులను పట్టుకోవటానికి పోలీసు బృందాలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి చెప్పారు. హత్యలెందుకు జరిగాయనేది తెలుసుకోవటానికి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేరాలను నియంత్రించాలి

● కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు అప్రమత్తంగా ఉండి.. నిబద్ధతతో పని చేయాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ సూచించారు. గురువారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి నేరాల నియంత్రణపై ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వన్‌టౌన్ పరిధి లో నమోదు అవుతున్న కేసుల వివరాలు, వాటి పరిష్కారాల, బాధితులకు న్యాయం జరగాలని ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి సూచించారు. అనంతరం కోర్టు కేసులు వివరాలను పరిశీలించారు. అదేవిధంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని, వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కరుణాకర్, ఎస్ఐ విజయకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చరిత్రను మలుపు తిప్పిన రోజు

(5వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్‌గా ఉంటారన్నారు. దీక్షా దివస్ ద్వారా నేటి తరంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తామన్నారు. దీక్షాదివస్ సందర్భంగా ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఖమ్మంలో నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమాలను తాతా మధుసూదన్ వివరించారు. ఉదయం 9గంటలకు ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ వద్దనున్న తెలంగాణా తల్లి విగ్రహానికి పుష్పాభిషేకం నిర్వహిస్తామని, అనంతరం పెవిలియన్‌గ్రౌండ్ సమీపంలోని తెలంగాణా అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తామన్నారు. కేసీఆర్ ఖమ్మం ఆసుపత్రిలో చేరిన సందర్భంగా అక్కడి రోగులకు పండ్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. తరువాత జిల్లా పార్టీ కార్యాలయంలో ఐదు నియోజకవర్గాల బీఆర్ఎస్ శ్రేణులతో సభ నిర్వహించి, అప్పటి ఉద్యమ చిత్రాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు.

దీక్షాదివస్ సందర్భంగా కొత్తగూడెంలో కూడా ఐదు నియోజకవర్గాల బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం ఉంటుందని వద్దిరాజు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి, ఉద్యమ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, బిచ్చాల తిరుమలరావు, నాయకులు శీలంశెట్టి వీరభద్రం పాల్గొన్నారు.

ఉద్యమాగ్నిని రగిలించిన నేల

(5వ పేజీ తరువాయి)

కేసీఆర్ వెంట నడవగా ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని వదిలివేశారు. ఖమ్మం జైలు వద్ద కేసీఆర్‌కు మద్దతుగా అప్పటి టీఆర్ఎస్ నాయకులు డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, దిండిగాల రాజేందర్, కుటుంబరావు, లింగనబోయిన సతీష్, తోపాటు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీలనుంచి రాష్ట్ర నాయకులు పోటు రంగారావు, తిరుమలరావు, సుగుణారావు, రామయ్యతో పాటు పీడీఎస్‌యూ నాయకులు అశోక్, ప్రదీప్, విజయలక్ష్మితో పాటు ఉద్యోగ జేఏసీ నుంచి అప్పటి టీజీవో రాష్ట్ర నాయకుడు హోదాలో ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు హోదాలో రంగరాజు, వెంకటపతిరాజు తదితరులు జిల్లా జైలు వద్ద ఖమ్మం ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. న్యాయవాదులు, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాల ఆందోళనతో కేసీఆర్ దీక్షకు స్పందన లభించింది.

ప్రత్యేక రాష్ట్ర ప్రకటనకు బీజం..

ఖమ్మం ఆసుపత్రిలో కేసీఆర్ దీక్ష విరమించారని అధికారులు ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ దీక్ష కొనసాగించాలంటూ ప్రజలు ఆందోళన చేశారు. దాంతో కేసీఆర్ మళ్లీ దీక్ష కొనసాగించారు. ఈ క్రమంలో కేసీఆర్‌ను ఖమ్మం ఆసుపత్రినుంచి హైదరాబాదుకు తరలించారు. ఆ తరువాత డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కేసీఆర్ దీక్ష విరమణ చేశారు.

కాగా ఖమ్మం వేదికగా సాగిన ఉద్యమంతో జిల్లాలో క్రమంగా టీఆర్ఎస్ బల పడింది. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరగడం, బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండడం, గత ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో జిల్లాలో మళ్లీ ఆ పార్టీ డీలాపడింది. ఈ నేపథ్యంలో తిరిగి పార్టీని బలోపేతం చేసేందుకు గత ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ఖమ్మం, కొత్తగూడెంతోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం దీక్షాదివాస్ నిర్వహించాలని నిర్ణయించింది. ఖమ్మంలో నిర్వహించే కార్యక్రమంలో మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కెళ్లపాటి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు తదితరులు పాల్గొంటారు. కొత్తగూడెంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో దీక్షాదివస్ నిర్వహించనున్నారు.

యాసంగి అరకల సందడి

(5వ పేజీ తరువాయి)

మొగ్గుచూపుతున్నారు. కోతలు పూర్తిఅయిన రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. విత్తనాలు, ఎరువులు, తెచ్చుకుని నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. సాగర్‌లో నీరు పుష్కలంగా ఉండటం, కృష్ణా పరివాహకప్రాంతంలో వరద రావడంతో ఈఏడాది వానాకాలానికి ముందుగానే నీటిని విడుదల చేశారు. మూడునెలలుగా సాగర్ నిండుకుండలా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 584 అడుగులమేర నీరు నిల్వఉంది. పాలేరు జలాశయంలో 18 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. మొదటిజోన్ నుంచి 2382 క్యూసెక్కుల నీరు పాలేరు జలాశయానికి వచ్చిచేరుతోంది. పాలేరు జలాశయం నుంచి రెండోజోన్ ఆయకట్టుకు 3119 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

పాలేరు పాతకాల్వకు 100 క్యూసెక్కులనీటిని విడుదల చేస్తున్నారు. యాసంగికి ఇప్పటికే షెడ్యూల్ ప్రకారం నీరు విడుదల చేస్తున్నారు. దీంతో అన్నదాతలు యాసంగిపనుల్లో బిజీగా ఉన్నారు. గత పదేళ్లుగా రాష్ట్రప్రభుత్వం వానాకాలం, యాసంగి పంటలకు నీరందిస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు పూర్తిస్థాయిలో పంటలు సాగు చేస్తున్నారు. వానాకలం పంటదిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడం, మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. దీంతో ఉత్సాహంగా యాసంగిసాగులో నిమగ్నమయ్యారు.

డిసెంబరు నెలాఖరులోగా నార్లు పోసుకోవాలి: ఏడీఏ సరిత

యాసంగిసాగుకు రైతులు డిసెంబరు నెలాఖరులోగా నార్లు పోసుకోవాలి. జనవరి 15నాటికి నాట్లు వేసుకుంటే బాగుంటుంది. దీంతో మార్చి చివరినాటికి పంట చేతికి వస్తుంది. యాసంగిలో డ్రమ్‌సీడర్, నేరుగా వెదజల్లే విధానంలో సాగు అనుకూలం. రైతులు ఈపద్ధతి అవలంబించడంద్వారా ఈసీజన్‌లో పంట 15రోజుల ముందే చేతికందుతుంది. అంతేకాకుండా ఎకరాకు సుమారు 8వేలవరకు ఖర్చు తగ్గుతుంది. రైతులు మెళకువలు పాటించాలి.

రైల్వే లైన్లను మార్చండి

పాలేరు మీదుగా ప్రతిపాదించిన రైల్వేలైన్లతో అన్నదాతలకు తీవ్ర నష్టం

రైల్వే బోర్డు ఛైర్మన్ సతీష్‌కుమార్‌కు ఎంపీ రఘురాం వినతి



రైల్వే బోర్డు ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గ అన్ని మండలాల్లోని సారవంతమైన భూముల్లోంచి ప్రతిపాదించిన డోర్నకల్ - మిర్యాలగూడ, గద్వాల రైల్వేలైన్‌తో ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఈ రైల్వేలైన్‌ను మార్చాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి రైల్వే బోర్డు ఛైర్మన్ సతీష్‌కుమార్‌ను కోరారు. ఢిల్లీలో గురువారం రైల్వే ప్రధాన కార్యాలయంలో ఆయనను కలిసి విన్నవించారు. డోర్నకల్ నుంచి వయా పాపటపల్లి - జాన్‌పహాడ్ (మిర్యాలగూడ), అలాగే డోర్నకల్- గద్వాల రైల్వే లైన్లు పూర్తిగా పాలేరు నియోజకవర్గం మీదుగా వెళ్లనుండడంతో ఈ ప్రాంత రైతులకు తీరని నష్టం చేకూరుతుందని అన్నారు. రైతులు సారవంతమైన భూముల్ని కోల్పోతారని వివరించారు. ఖమ్మం జిల్లాలో మూడో రైల్వేలైన్ నిర్మాణం తుదిదశకు వచ్చిందని ఇక్కడికి ఆరు జాతీయ రహదారులతో అనుసంధానం ఉందని ఈ ప్రాంతంలో కొత్తగా రైల్వేలైన్‌తో ప్రజలను తీవ్రంగా నష్టపరచడం కంటే ప్రత్యామ్నాయ మార్గం చూడటమే ఉత్తమమని ఎంపీ సూచించారు. డోర్నకల్- మిర్యాలగూడ(జాన్‌పహాడ్) నూతన రైల్వే లైన్ ను పాలేరు నియోజకవర్గం నుంచి కాకుండా ప్రత్యామ్నాయ వెన్నారం..మన్నెగూడెం, మరిపెడ, మోతే మీదుగా నిర్మిస్తే మొత్తం 124 కిలోమీటర్ల నుంచి 19 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని ఎంపీ రైల్వే బోర్డుఛైర్మన్‌కు వివరించారు. భూ సేకరణ వ్యయం బాగా తగ్గి ఇటు లైన్ నిర్మాణ ఖర్చుకు సంబంధించి ప్రభుత్వానికి, రైల్వేకు కోట్లాది రూపాయలు ఆదా అవుతుందని తెలిపారు. ఎంపీ వినతిపై రైల్వేబోర్డు ఛైర్మన్ సీఈవో సతీష్‌కుమార్ స్పందించి ఇంతకుముందు అనుకున్నట్లుగా రైల్వేలైన్ పున: పరిశీలన చేస్తామని చెప్పినట్లు తెలిపారు.

ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

(5వ పేజీ తరువాయి)

అలోపతిక్ వైద్యాన్ని చేయొద్దని సూచించారు. నగరంలోని మయూరి ఆస్పత్రిలో అబార్షన్లు చేస్తున్నారంటూ ఆరోపణలు రావడంతో ఆ ఆస్పత్రిలోనూ తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ థియేటర్ ల్యాబ్, మందుల దుకాణం పరిశీలించారు. అక్కడ వైద్యులు పీజీ చేయకుండానే బోర్డులు పెట్టుకోవడం పట్ల డీఎంహెచ్‌వో మందలించారు. నోటీసులు జారీ చేశారు. ఈ దాడుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చందూనాయక్, డాక్టర్ రామారావు, డెమో సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి దుద్దిళ్లను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

రుద్రంపూర్, (సింగరేణి) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును గురువారం ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం కలిశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబుకు వివరించారు. అనంతరం మంత్రిని ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, నర్సింహారెడ్డి, సమ్మయ్య, త్యాగరాజన్, జెట్టి శంకర్‌రావు, వికాస్‌కుమార్ యాదవ్, ఆల్బర్ట్, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మూత్రవిసర్జన కోసం వెళ్లి మృత్యువాత

తల్లాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూత్రవిసర్జన చేసేందుకు తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన గురువారం తల్లాడ మండలం రంగంబంజర గ్రామంలో చోటుచేసుకుంది. రంగంబంజర గ్రామానికి చెందిన పిన్నిశెట్టి నాగబాబు(32)దుర్మరణం చెందాడు. నాగబాబు తెల్లవారుజామున మూత్రవిసర్జన చేసేందుకు ఇంట్లో నుంచి వచ్చి జాతీయ రహదారి దాటుతుండగా కల్లూరు నుంచి తల్లాడ వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం నాగబాబును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న నాగబాబును 108వాహనంలో చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా మృతిచెందాడు. నాగబాబు తల్లి హైమావతితో కలిసి జీవిస్తున్నాడు. నాగబాబుకు అన్న, అక్క ఉన్నారు. వారిరువురికి వివాహాలై వేర్వేరు చోట్ల నివాసముంటున్నారు. తాపీ పనులకు వెళ్తూ తల్లిని పోషిస్తూ జీవనం గడుపుతున్నాడు. మృతుడి అన్న కృష్ణయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో అంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నాగబాబు (ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తల్లాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించినందుకు మనస్తాపం చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన దుగ్గిదేవర యశ్వంత్ ఫణీంద్ర అలియాస్ చెన్నయ్య (21) అనే యువకుడు మృతిచెందాడు. ఇంటర్మీడియేట్ పూర్తిచేసి న యశ్వంత్ కొంతకాలంగా బావలతో కలిసి పత్తి వ్యాపారం చేస్తున్నాడు. తండ్రి పొలం పనికి రమ్మని మందలించినందుకు మనస్తాపం చెందిన ఈనెల 23న యశ్వంత్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న యశ్వంత్‌ను చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్‌హెచ్‌వో జేవీఆర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెన్నయ్య (ఫైల్)

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఏన్కూరు/ఆళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో సాగర్ కాలవలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ఏన్కూరులో జరిగింది. పోలీసుల కథ నం ప్రకారం తల్లాడ మండలం అంజనాపురంకు చెందిన నోమల సత్యనారాయణ (30) అనే వ్యక్తి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు ఏలూరుకుచెందిన శిరీషతో సుమారు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వివాహ సమయంలో సుమారు రూ.5లక్షల అప్పు చేశారు. దీనికితోడు అప్పుచేసి ఆటో కొన్నాడు అప్పుల విషయంలో కు టుంబంలో తరుచు గొడవలు జరుగుతున్నాయి. అప్పులు తీర్చే మార్గంలేక మనస్థాపంతో ఈనెల 26న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు రెం డురోజుల నుంచి వెతుకుతున్నారు. గురువారం సాగర్ కాలువలో సత్యనారాయణ మృతదేహాన్ని కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రఫీ సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఆళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆళ్లపల్లి మండలంలో గురువారం జరిగింది. గ్రామస్థులు సమాచారం ప్రకారం ఆళ్లపల్లి మండలం, అనంతోగు గ్రామానికి చెందిన గళిగ రామారావు (30) బుధవారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆర్ఎంపీ దగ్గరకు తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం తరలించారు. గురువారం చికిత్స పొందుతు మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

వ్యాయామ ఉపాధ్యాయుడి హఠాన్మరణం

ముదిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మేడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్ (37) గుండెపోటుతో గురువారం మృతిచెందారు. చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన శ్రీనివాస్ మేడేప ల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. గురువారం తెల్లవారుజామున ఖమ్మంలోని తన సోదరుడి ఇంట్లో అకస్మాత్తుగా చాతిలో నొప్పి రావడంతో గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు మేడేపల్లి ప్రధానోపాధ్యాయుడు బండి నాగేశ్వరరావు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.20వేలను శ్రీనివాస్ తల్లిదండ్రులకు అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. శ్రీనివాస్ మృతి పట్ల పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సానుభూతి తెలిపారు.


శ్రీనివాస్ (ఫైల్)

2.24 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

భద్రాచలం/టేకులపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద గురువారం భద్రాచలం ఎక్సైజ్ పోలీసులు రూ.56 లక్షల విలువ చేసే 210కేజీల గంజా యిని పట్టుకున్నారు. భద్రాద్రి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య తెలిపిన వివరాల ప్రకా రం.. భద్రాచలంలోని స్థానిక ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా, ఎస్‌ఐ రాజు వాహన తనిఖీ నిర్వహిస్తుండగా నెల్లిపాక వైపు నుంచి వస్తు న్న కారులో తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వాహనంలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. అరెస్టయినవారిలో మహారాష్ట్రకు చెందిన పండరీనాథ్, దత్తాత్రేయ వాంగ్మ ఉన్నారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లతో పాటు కారును స్వాధీనం చేసుకున్నామని జానయ్య తెలిపారు. నిషేధిత గంజాయి రవాణాకు పాల్పడితే ఆ సమాచారం తెలిసినవారు టోల్‌ఫ్రీ నెంబర్ 1800425252కు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ షేక్ రహీమున్నీసాబేగం, ఎస్‌ఐ అల్లూరి సీతారామరాజు, ఎక్సైజ్ సిబ్బంది ఎస్‌డి ఆలీం, కె.బాబు, వి.వీరబాబు, ఆర్.రాకేష్, ఎం.కిరణ్, టి.లలిత, సుజాత పాల్గొన్నారు.

మరో ఘటనలో రూ.1.20లక్షల విలువైన ఐదు కేజీల ఎండు గంజాయిని కొత్తగూడేనికి చెందిన టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ గౌతమ్‌తో పాటు రామకృష్ణ, హబీబ్, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్ శ్రావణి, రమేష్ పట్టుకున్నారు.

9కేజీల గంజాయి పట్టివేత

టేకులపల్లి (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మోటారుసైకిల్‌పై తరలిస్తున్న 9కేజీల గంజాయిని గురువారం టేకులపల్లి పోలీసులు పట్టుకొన్నారు. పోలీసుల కథనం ప్రకారం ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై మండలంలోని కారుకొండక్రాస్ రోడ్డు వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటారుసైకిల్‌పై గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఆత్కూరులో పట్టపగలు చోరీ

రూ.లక్షన్నర నగదు అపహరణ

మధిర రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామంలో గురువారం పట్టపగలు ఓ ఇంట్లో దొంగలు చొరబడి నగదు అపహరించుకుపోయారు. స్థానికంగా ఈ ఘటన సంచలనం కలిగించింది. ఆత్కూరు గ్రామంలోని తునికిపాడు రోడ్డులో మీనుగు నాగయ్యకు చెందిన ఇంట్లో పట్టపగలు దొంగలు పడ్డారు. నాగయ్య గేదెలు మేపడానికి వెళ్లగా ఆయన భార్య వ్యవసా య కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరు వాలో ఉన్న రూ.లక్షన్నర నగదును, ఒక బంగారం చైన్‌ను అపహరించుకుపోయారు. కూలీ పనులకు వెళ్లి మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో నాగయ్య భార్య ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఆమె లోపలకు వెళ్లి చూసేస రికి బీరువాలో ఉన్న బంగారు చైన్, నగదు కన్పించలేదు. దీంతో ఆమె లబోదిబోమంటూ బోరున విలపించింది. బాధితులు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇసుకాసురులు..

- కట్టలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా
- ఏటి నుంచి మట్టి తీసి ఇసుక తయారీ
- వాగులో భారీ గోతులు
- పట్టించుకోని అధికారులు


కట్టలేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక

పెనుబల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొందరు అక్రమార్కులకు కట్టలేరు వాగు కల్పతరువు గా మారింది. ఇసుక అక్రమ రవాణానే కాకుండా మట్టిని కూడా అక్రమంగా తరలించి కృత్రిమ ఇసుక కుటీర పరిశ్రమగా సాగుతున్నా ఆ గ్రామా ల వైపు మైనింగ్, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులకు ఇష్టారాజ్యంగా మారింది.

మట్టి, ఇసుక తరలింపునకు కట్టలేరు మూలం..

పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ ప్రాజెక్టు అలుగువాగు నుంచి ప్రారంభమై మండలంలోని సూరయ్య బంజర్, కోండ్రుపాడు, గణేశులపాడు, లంకాశేషయ్యబంజర గ్రామాలతోపాటు వేంసూరు మండలంలోని రామన్నపాలెం, అడసర్లపాడు గ్రామాల శివార్ల గుండా ప్రవహిస్తుంది. వర్షాలు మొదలైనప్పటికీ నుంచి కట్టలేరులో ఇసుక అక్రమ రవాణా నిరంతరం కొనసాగుతుం ది. కొన్ని గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా రాత్రీపగలు తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతుంది. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులకు మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది.

కట్టలేరు మట్టితో ఇసుక తయారీ..

అక్రమార్కులకు ఆదాయ వనరుగా కట్టలేరు వాగు మారింది. ఈ కట్టలేరు సుమారు 15కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఆ వాగు నుంచి ఇసుకను పెనుబల్లి, వేంసూరు, ఎన్టీఆర్ జిల్లా మండలాలకు రాత్రీపగలు యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. ప్రభు త్వం ఈ ప్రాంతంలో ఇసుక క్వారీ ఏర్పాటుచేయకపోవడంతో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం అధికారికంగా ఇసుక క్వారీని ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వం మైనింగ్‌శాఖ నుంచి కాకపోయినా కనీసం ఆయా గ్రామపంచాయతీల్లో వేలం ద్వారా ఇసుక విక్రయాలను చేపట్టినట్లయితే ఆయా గ్రామపంచాయతీలకు ఆదాయ వనరుగా మారుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.



గ్రామంలో రోడ్డు పక్కన డంప్ చేసిన ఇసుకతో కూడిన మట్టి, మట్టినుంచి ఇసుకను తీస్తున్న దృశ్యం

కుటీర పరిశ్రమగా సాగుతున్న మట్టి నుంచి ఇసుక తయారీ..

కట్టలేరు వాగులో ఇసుక అడుగంటగానే అక్రమార్కులు మట్టిని సైతం తోడేస్తున్నారు. ఇసుకతో కూడిన మట్టిని గ్రామాల్లోకి ట్రాక్టర్లతో తరలించి మోటర్ల నీటితో మట్టిని కడిగి ఇసుకను తయారు చేస్తున్నారు. ఈ ఇసుకను ఇతర మండలాలకు తరలించి ట్రాక్టర్ ట్రిప్పు రూ.ఐదారువేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కట్టలేరు నుంచి మట్టిని గ్రామాల్లోకి తరలించి ఇళ్ల పరిసరాలతోపాటు రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. కనీసం గ్రామంలోకి బస్సులు, లారీలు వెళ్లే రహదారి లేకుండా చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక తోలకాల వలన ఆదాయం మెండుగా వస్తుండటంతో గ్రామాల్లోని అత్యధికులు ట్రాక్టర్లను కొనుగోలు చేసి ఇసుక తోలకాలే ప్రధాన వనరుగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఈ తరహాలో ఆదాయం వస్తుండటంతో యువకులు సైతం ఇతర పనులకు వెళ్లకుండా ఇసుక తయారీనే ఆదాయ వనరుగా ఎంచుకొని సాగిస్తుండటంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా విరాజిల్లుతుంది.

మట్టినుంచి ఇసుక తీస్తున్న విషయం మా దృష్టికి రాలేదు:సాయినాథ్, మైనింగ్ ఏడీ

పెనుబల్లి మండలంలోని కట్టలేరు వాగు నుంచి మట్టిని తోడేసు ఇసుక తయారీ విషయం తమ దృష్టికి రాలేదు. కట్టలేరు వాగులో ఇసుక స్థానిక సంస్థలకు అప్పగించే ప్రణాళికను సిద్ధం చేశాం. ఈ విషయంపై తమకు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

తుమ్మల, పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే జారే

దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాణిని సత్కరించిన మంత్రులు


మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణిని అభినందిస్తున్న మంత్రి పొంగులేటి

దమ్మపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి హైదరాబాద్‌లో వారి కార్యాలయాల్లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల దమ్మపేట మార్కెట్ కమిటి చైర్‌పర్సన్‌గా వాసం రాణిని నియామకం చేయటంతో తుమ్మల, పొంగులేటిలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చైర్‌పర్సన్ వాసం రాణీతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధికి కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందని పార్టీ అభివృద్ధి కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుతున్న హామీలను, పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. చైర్‌పర్సన్ వాసం రాణిశ్రీనులను సత్కరించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే గంద్ర విజయరమణారావు, వేం నరేంద్రరెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులను కాంగ్రెస్ నాయకులు మార్యదపూర్వకంగా కలిసారు. కలిసినవారిలో కాంగ్రెస్ నాయకులు వాసం శ్రీను, హరిబాబు, వేణు తదితరులున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్

పాల్వంచ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లోని వివిధ విద్యుత్ స్టేషన్ల నుంచి హైదరాబాద్ విద్యుత్‌సౌదాకు సీనియారిటీ ప్రకారం నిర్వహించాల్సిన బదిలీ ప్రక్రియ సక్రమంగా జరగలేదని, అందువల్ల ఇప్పటివరకు జరిగిన బదిలీలను రద్దు చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్‌ల సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇరు అసోసియేషన్ల సభ్యులు ఇంజనీర్లు కేటీపీఎస్ 5,6 దశల సీఈ ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేసి పలు సమస్యలను ఆయనకు వివరించారు. 339 మంది కొత్తగా విధుల్లో చేరబోతున్న ఇంజనీర్లకు పోస్టింగ్‌లు ఇచ్చే ముందే 8 సంవత్సరాలుగా పని చేస్తున్న ఇంజనీర్లకు ట్రాన్స్‌ఫర్స్ ఇవ్వాలని ఆయనను కోరారు. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ టీఎస్ జెన్కో ద్వారానే నిర్మాణం చేయాలని కోరారు. విద్యుత్‌సౌధా ట్రాన్స్‌ఫర్స్ కోసం గైడ్‌లైన్స్ ప్రిపేర్ చేసి ట్రాన్స్‌ఫర్ పాలసీ ఫ్రేమ్ చేయాలని కోరారు. అసోసియేషన్ సభ్యుల సమస్యలు విన్న సీఈ సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ల నాయకులు ఉమామహేశ్వరరావు, అభినేష్‌రెడ్డి, ప్రదీప్, రామారావు, రజిత, చంద్రకళాధర్, కీర్తి, శ్రీపాకపాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న లారీ: ఒకరు మృతి

తల్లాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరి గడ్డి లోడ్‌తో జాతీయ రహదారి ఎక్కుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొని ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి తల్లాడ ఎన్టీఆర్‌నగర్ సమీపంలో తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన షేక్.మీరా(40) మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన చీమకుర్తి వెంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. మీరా కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మీరా మృతితో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది.


మీరా (ఫైల్)

భద్రాద్రిలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే వెంకట్రావ్ వినతి

భద్రాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సమీకృత మార్కెట్ సముదాయం ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలను కలిసి ఎమ్మెల్యే వెంకట్రావు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. భద్రాచలంలో వ్యవసాయ ఉత్పత్తులకు నిలయంగా ఉందని సమీకృత మార్కెట్ లేకపోవడం వలన రైతులకు సరిపోని నిల్వ సౌకర్యాలు, అసమర్థమైన మార్కెటింగ్ విధానాలు, పరిమిత రవాణ ఎంపికలు వంటి ముఖ్యమైన సవాళ్లను సృష్టించిందన్నారు. ఈ సమస్యల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతూ తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. నిల్వచేయడానికి సమర్థవంతమైన ధరల యంత్రాంగాలతో కూడిన సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రమేష్‌గౌడ్, బుడగం శ్రీను, తోటకూర రవిశంకర్ పాల్గొన్నారు.


తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి?

కూసుమంచి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో పోలంపల్లి లక్ష్మీనారాయణ(32)అనేవ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామస్థుల కధనం ప్రకారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ సుమారు పదేళ్ల నుంచి ముత్యాలగూడెంలో ఓ రైతు వద్ద పాలేరుగా ఉంటూ నివాసం ఉంటున్నాడు. ఈ క్రమం లో రైతుకు చెందిన చేపల చెరువులో పడి చనిపోయాడు. కాగా విద్యుత్‌షాక్ తగలడం తోనే చెరువులోపడి చనిపోయినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

జాతీయ క్రీడాపోటీలకు ఏకలవ్య విద్యార్థులు

దుమ్ముగూడెం నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ విభాగంలో విద్యార్థిని విహాసిక, హాకీలో విద్యార్థులు సాయికిరణ్, ఎస్ సంతోష్, ఫుట్‌బాల్‌కు పీరాజేష్, ఎస్ వశిష్ట, ఎం కీర్తన, ఈ కీర్తి, ఎం పూజశ్రీ, పిఅనూష పోటీల్లో పాల్గొంటారు. డిసెంబరులో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో జరిగే జాతీయ క్రీడా శిబిరానికి హాజరుకానున్నారు. ప్రిన్సిపాల్ విజేందర్‌సింగ్, టీచర్లు క్రీడాకారుల్ని అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జోరుగా పత్తి దందా..



- కాంటాలో మోసం
- తరుగులో దోపిడీ
- పట్టించుకోని అధికారులు
- నష్ట పోతున్న రైతులు

చర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చర్ల మండలంలో జోరుగా పత్తి దందా సాగుతోంది. గిరిజన రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని చర్ల మండలంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వ్యాపారులు దోచుకుంటున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండంతో ధరలో, కాంటాలో, తరుగు పేరుతో దందా చేస్తున్నారు. కష్టపడి పత్తి పండించిన రైతులకు ఆఖరికి అప్పులే మిగులుతున్నాయి.

దందా సాగేది ఇలా..

చర్ల మండలంలోని గిరిజన గ్రామాల్లో రైతులు అధికంగా పత్తి పంటను సాగు చేశారు. చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెం, చర్ల చెందిన వ్యాపారులు పత్తి కొనుగోలు చేస్తున్నారు. వీరికి తోడు ఇతర మండలాల నుంచి వ్యాపారులు కూడా కొనుగోళ్లు ప్రారంభించారు. స్థానిక వ్యాపారులు ఉదయాన్నే గ్రామాలకు చేరుకుని రైతుల వద్ద పత్తి కొనుగోళ్లు సాగిస్తున్నారు. మార్కెట్‌లో ధరకన్నా తక్కువ ధర చెల్లిస్తున్నారు. ఇదే క్రమంలో తరుగుపేరుతో మూడు నుంచి 5 కేజీలు దోచుకుంటున్నారు. అలాగే పురుగు మందులు ఇచ్చాం, పెట్టుబడి పెట్టామని చెప్పుతూ పంటను తీసుకుంటున్నారు. ఇక పట్టణాల నుంచి వస్తున్న వ్యాపారులు ధర ఎక్కువ చెల్లిస్తామని చెప్పి కాటాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఇలానే చర్ల మండలం సింగసముద్రంలో 100 కేజీల బ్యాగులో సుమారు 30 కేజీల పత్తిని ఎక్కువగా తూకం వేసి మోసానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి వారికి దేహశుద్ధి చేశారు. నిబంధనల ప్రకారం లైసెన్స్‌లు లేకుండా పత్తి కొనుగోళ్లు చేయడం చట్ట విరుద్ధం మార్కెట్ కమిటీ అధికారులు దృష్టి సారించకపోవడమే దందాకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే కాటాలను సివిల్ సప్లయ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అసలు ఆ శాఖ అధికారులు ఉన్నారా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నష్ట పోతున్న గిరిజన రైతులు

వ్యాపారులు దందాలకు పాల్పడుతుండడంతో స్థానిక రైతులు నిలువునా మోస పోతున్నారు. ఏడాది అంతా కష్ట పడిన, కష్టాన్ని వ్యాపారులు దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పత్తి కొనుగోలు కేంద్రం చర్లలో లేక పోవడం కూడా ఈ దందాకు కారణమని తెలుస్తోంది. చర్ల మండల కేంద్రంతోపాటు ఆర్‌కొత్తగూడెం చెందిన వ్యాపారులు ప్రతీ ఏడాది లక్షల్లో కొనుగోళ్ళు సాగించి, పేదల కష్టంతో లక్షలు ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా చర్ల మండల రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు, చర్ల మార్కెట్ కమిటీ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
శుక్రవారం 29 నవంబరు 2024
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి

ఖమ్మం సిటీ



నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తికి ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్,నవంబరు28(ఆంధ్రజ్యోతి):ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రాయల సత్యం మోటార్ సైకిల్ నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన కేసులో ఆరునెలలు జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధించారు. ఈ మేరకు ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పు చెప్పారు. ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామానికి చెందిన బొంతు ఎల్లయ్య 2016లో ముదిగొండ నుంచి స్వగ్రామం వెంకటాపురం వస్తుండగా, మోటారు సైకిల్ నడుపుతున్న సత్యం అతివేగంగా అజాగ్రత్తగా వస్తూ ఎల్లయ్యను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆయన చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	56 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	50
బీరకాయ	58
పచ్చిమిర్చి	28
కాకరకాయ	34
బెండకాయ	24
పొట్లకాయ	38
దోసకాయ	28-48
చిక్కుడు	68
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	34
దొండ	38-44
సొరకాయ	20
క్యారెట్	64
క్యాప్సికం	48
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	185
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కంగువ
తిరుమల:	దేవకీనందన వాసుదేవ
సినీ గెలాక్సీ:	జీబ్రా

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225979
కార్గోసేవల నెంబరు: 9154298589

ఖమ్మం పాతబస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225965
కార్గోసేవల నెంబరు: 9704345599

సత్తుపల్లి బస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225990
కార్గోసేవల నెంబరు: 9154298595

మధిర బస్టాండ్
డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ: 7382925289
కార్గోసేవల నెంబరు: 8143765370

నేడు శివపార్వతుల కల్యాణం

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు28(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం రాత్రి 9గంటలకు మామిళ్ల గూడెం రామాలయం వద్దగల డైమండ్ టవర్స్‌లో శివపార్వతుల కల్యాణం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకుడు పర్సా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30కి ఊరేగింపుగా స్వామి ,అమ్మవార్ల విగ్రహాలను కళ్యాణ వేదికవద్దకు తీసుకు వస్తామన్నారు.

4న సీనియర్ మహిళా కబడ్డీ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 4న నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సీనియర్ మహిళల కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, క్రిష్టఫర్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి డిసెంబరు 7 నుంచి 10 వరకు తేదీలలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

సహకార గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నిక

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలు గురువారం సహకార సంఘం కార్యాలయంలో జరిగాయి. అధ్యక్షుడిగా కొల్లిమర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పి.శ్రీదేవి, కార్యదర్శిగా బి.ఏడుకొండలు, కోశాధికారిగా ఎస్‌డీవీ రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సెంట్రల్ అసోసియేషన్ కోశాధికారి గంధం శ్రీనివాసరావు వ్యవహరించారు. భవిష్యత్తులో సొసైటీ బలోపేతానికి కృషి చేస్తామని, గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తామన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఖమ్మంటౌన్,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గురువారం ఎన్‌సీసీ,ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేకప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా, వైస్‌ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎన్ శాస్త్రి, బానోత్‌రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సునంద,ఎన్‌సీసీఆఫీసర్ ఓంకార్, ఎన్ఎస్ఎస్‌పీవోలు సుజిత్‌రెడ్డి, పిచ్చయ్య, అధ్యాపకులు ధనమూర్తి,కరీం పాల్గొన్నారు.

వైద్యసదుపాయాల అవసరాలపై
నివేదికలు సిద్ధం చేయాలి

» ఆరోగ్యశాఖ మంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయాలి
» అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య సౌకర్యాల అవసరంపై నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. డిసెంబరు6న జిల్లాకు రానున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ జిల్లాలో వైద్యారోగ్య శాఖ మంత్రి పర్యటనకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. డిసెంబరు 6న ఉదయం జిల్లా ఆసుపత్రి , మాతా శిశు సంరక్షణ కేంద్రం సందర్శిస్తారన్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పారిశుధ్య పనులు, సైన్ బోర్డుల ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యరోగ్యశాఖ పనితీరుపై సమీక్ష ఉంటుందని, ఈ సమావేశానికి వైద్యాధికారులు, సిబ్బంది హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. వైద్యశాఖ పరిధిలో జిల్లాకు ఉన్న అవసరాలపై ప్రతిపాదనలు రేపటి వరకు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. వైద్యశాఖ పని తీరు,రోగులకు అందుతున్న సేవలను వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేయాలన్నారు. సమీక్ష తర్వాత మంత్రి వైద్య కళాశాల నిర్మాణ స్థలాన్ని సందర్శిస్తారని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కళావతిబాయి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణపై సమీక్ష

జిల్లాలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ మనందరి బాధ్యత దీనికోసం అధికారులు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 3నెలల పాటు డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ, వీటివల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, డీడబ్ల్యూవో. రాంగోపాల్‌రెడ్డి, మధిరషేర్ ఎన్జీవో డైరెక్టర్ జి.గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు గోపాల్‌స్వామి,హనుమంతరావు పాల్గొన్నారు.

ఏడు లేఅవుట్స్‌కు అనుమతులు జారీ



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజ

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఖచ్చితమైన నిబంధనలు పాటించిన లేఅవుట్స్‌కు మాత్రమే అనుమతులు జారీ చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పష్టం చేశారు. గురువారం కేఎంసీలో స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజతో కలిసి లేఅవుట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. మొత్తం 22లేఅవుట్స్‌కు దరఖాస్తులు చేయగా వాటిలో ఏడులేఅవుట్స్‌కు అధికారులు అనుమతులు జారీ చేశారు. ఇతర దరఖాస్తులను ఇరిగేషన్, రహదారులు భవనాలుశాఖ,పంచాయతీరాజ్,ఇతర ప్రభుత్వశాఖల పరిశీలన చేసిన అనంతరం అనుమతులు జారీ చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు పాఠశాలల ఎంపిక

ఖమ్మంటౌన్,నవంబరు28(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేది ఆధ్వర్యంలో జిల్లా చెకుముకి సైన్సు సంబురాలను గురువారం నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన పాఠశాలలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ పోటీ పరీక్షలకు అన్ని మండలాల నుంచి 240మంది విద్యార్థులు పాల్గొనగా విభాగాల వారీగా పరీక్ష, క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలను ఎంపికచేశారు. ప్రభుత్వ ఇంగ్లీష్‌మీడియంలో మధిరలోని టీఎంఆర్ఈఐఎస్ విద్యార్థులు ప్రథమ, జడ్పీఎస్ఎస్ జల్లేపల్లి ద్వితీయ, ఖమ్మంలోని ఎన్ఎస్ క్యాంపు పాఠశాలతృతీయ బహుమతులు పొందారు. ప్రభుత్వ తెలుగుమీడియంలో వేంసూరు మండలం అడసర్లపాడు జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రథమ, మధిర మండలం మహదేవపురం జడ్పీఎస్ఎస్ ద్వితీయ, కొణిజర్ల మండలం గుబ్బగుర్తి జడ్పీఎస్ ఎస్ పాఠశాల తృతీయ బహుమతులు సాధించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో పాలేరులోని జవహర్‌నవోదయ ప్రథమ, వైరాలోని టీజీఆర్ఎస్ బాలికలు పాఠశాల ద్వితీయ, కల్లూరులోని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌స్కూల్ తృతీయ బహుమతి గెలిచారు ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఖమ్మంలోని హార్వెస్టు స్కూల్ ప్రథమ, గీతాంజలిస్కూల్ ద్వితీయ, మధిరలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల తృతీయ బహుమతులు సాధించారు. ప్రథమస్థానం పొందిన వారిని వచ్చేనెల 14,15,16 తేదీల్లో ఆదిలాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్, రామారావు తెలిపారు.ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శైలజలక్ష్మి, జేవీవీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలంటే లెక్కలేదా?

» నారాయణపేట్ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి
» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీ జరిగి విద్యార్థుల ప్రాణాలు పోతుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించటం లేదని విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. నారాయణపేట్ జిల్లాలో వారం రోజుల్లోనే మూడుసార్లు ఫుడ్ పాయిజన్ జరిగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురైనా ప్రభుత్వం ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశభవిష్యత్‌ను నిర్ణయించేది నేటి విద్యార్థులే అని ఇంతటి సంఘటనలు జరుగుతున్న మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించటం లేదని విమర్శించారు. విద్యార్థులకు అనుకూలంగా నిరసన చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేయటం అప్రజాస్వామిక చర్యగా పేర్కొన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలేకు నివాళి



బీఆర్ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంటౌన్/ ఖమ్మంవ్యవసాయం,నవంబరు28(ఆంధ్రజ్యోతి):మహాత్మా జ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గురువారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి,ఉప్పల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, ఉప్పల వెంకటరమణ పాల్గొన్నారు. డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు నివాళులు అర్పించారు.

ఖమ్మంరూరల్: మండలంలోని ఎమ్-వెంకటాయపాలెంలో పూలే వర్థంతి వేడుకలు కేవీపీఎస్ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు పాపిట్ల సత్యనారాయణ, మండల నాయకులు ఏపూరి వరకుమార్, ఉపపలయ్య, రాంబాబు,రంజిత్, యదగిరి నివాళులర్పించారు.

ముసుగు మహిళల ఆచూకీ తెలపండి

» నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్

నేలకొండపల్లి,నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఈ నెల25,26తేదీల్లో ముసుగులేసుకున్న 35-40 సంవత్సరాల మహిళలను నేలకొండపల్లిలో ఎక్కడైనా చూసి ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సంతోష్ కోరారు. వారు కొన్ని రోజులుగా నేలకొండపల్లిలోనే ఉన్నారని, వాళ్లకు ఎవరైనా షెల్టర్ ఇచ్చి ఉండొచ్చన్న అనుమానాలున్నాయన్నారు. ముసుగు మహిళల ఆచూకీ గురించి తెలిస్తే చెప్పాలని, చెప్పిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ చెప్పారు. ఇళ్లను అద్దెలకు ఇచ్చే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్ కోరారు.

అభివృద్ధి పనులను వేగిరం చేయాలి

» అదనపు కలెక్టర్ శ్రీజ



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగిరం చేయాలని అనదపు కలెక్టర్ శ్రీజ అధికారులకు సూచించారు. గురువారం ఆమె జిల్లా జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. డిసెంబరు5న జిల్లాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు రానున్న నేపథ్యంలో ఆస్పత్రిలో పలు పనులను ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో రూ.25 కోట్లతో నిర్మిస్తున్న ఎమర్జెన్సీ ట్రామాకేర్ భవన నిర్మాణం పనులను ఆమె పరిశీలించారు. పనులను మరింత వేగిరం చేయాలన్నారు. ఆ తర్వాత ఆస్పత్రి పాత భవానికి నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. ప్రైవేటు సంస్థతో నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో అన్ని వసతులు ఉండాలన్నారు. రోగులకు సేవల్లో ఇబ్బందులు కలగొద్దన్నారు. డయాలసిస్‌కు వస్తున్న మందులు, ఖర్చయిన మందులు వివరాలతో ప్రదర్శనకు ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయాలని శ్రీజ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, టీఎస్ఎంఐడీసీ డీఈ విద్యాసాగర్, ఏఈ జమలయ్య, ఆర్ఎంవో డాక్టర్ వినాయక్ రాథోడ్ ఉన్నారు.

రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

» రైతు పండగ మహాసభను విజయవంతం చేయాలి
» డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తోందని, విత్తనాల సబ్సిడీ నుంచి పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు రైతులకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్ అధ్యక్షతన కిసాన్‌సెల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉంటూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రేపు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు పండుగ మహాసభలను విజయవంతం చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కిసాన్‌సెల్ అధ్యక్షులు మొక్క శేఖర్‌గౌడ్ కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన వ్యవసాయ ప్రోత్సహకాలు, రైతురుణమాఫీపై వివరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం పాల్గొన్నారు.

సంజీవయ్యకు నివాళులు

తిరుమలాయపాలెం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల కాగ్రెస్ పార్టీనాయకులు మాజీసర్పంచ్ పోలెపొంగు సంజీవయ్యకు గురువారం వివిధ పార్టీల నేతలు ఘననివాళులర్పించారు.సంజీవయ్యఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంచర్చికాంపౌండ్ ,నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. గురువారం నగరంలోనిప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుర్రాలపాడుకు చెందిన కొట్టి దిలీప్, జడ వినయ్ కుమార్, ఖమ్మానికి చెందిన కొప్పుల కాలేబు మాట్లాడారు.

యాగాలు నిర్వహించటం అభినందనీయం

» రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు



ఖమ్మంసాంస్కృతికం,నవంబరు28(ఆంధ్రజ్యోతి):లోకకళ్యాణం కోసం హోమ, యాగ క్రతువులు నిర్వహహించటం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజురవిచంద్ర అన్నారు. ఖమ్మంమమతా రోడ్‌లో నిర్వహిస్తున్న సహస్రచండీ సహిత మహారుద్రయాగాన్ని ఆయన గురువారం సందర్శించి హోమ క్రతువులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్మంలో తొలిసారిగా భారీస్థాయిలో హోమ, యాగాలను నిర్వహించటంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. లోక కళ్యాణం కోసం నిర్వహిస్తున్న హోమ కార్యాలకు రూ.3లక్షల విరాళాన్ని అందజేశారు. సత్కార్యం కోసం నిర్వహిస్తున్న హోమ కార్యక్రమానికి తనవంతుగా అన్ని విధాలా సహ కరిస్తానని చెప్పారు. గురువారం నాటి కార్యక్రమంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వహించారు. హోమాలు, యాగక్రతువుల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యాగకర్త దండ్యాల లక్ష్మణరావు, స్థలదాత గుర్రం మురళి పాల్గొన్నారు.

శ్రీసిటీ చైర్మన్ వెంకట్రావుకు పితృవియోగం

» నివాళులర్పించిన ఎమ్మెల్యే కూనంనేని, ప్రజాప్రతినిధులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మంరూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బారుగూడెంలోని శ్రీసిటి చైర్మన్ గరికపాటి వెంకట్రావు తండ్రి గరికపాటి రాఘవయ్య(95) అనారోగ్యంతో గురువారం కరుణగిరి ప్రాంతంలోని స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాఘవయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారులు గరికపాటి వెంకట్రావు, ఆంజనేయ ప్రసాద్‌ను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర నాయకులు మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్, పలువురు ప్రజాప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఫోన్ నెంబర్లు

శానిటరి ఇన్‌స్పెక్టర్	ఫోన్ నెంబర్	డివిజన్లు
ఎస్‌కే బాబు	91215 52855	1,2,3,4,5,6,7,8,54,55
డీ రమేశ్	97012 98284	9,10,11,12,13,14,15,19,20,21
కే మల్లయ్య	99591 02617	16,18,22,23,24,25,26,37,38,39
జే భీమయ్య	94946 50739	40,41,42,43,44,45,49,51,52,53
పీ వెంకటేశ్వర్లు	91772 36224	35,46,47,48,50,56,57,58,59,60,
ఎస్ యల్లాస్వామి	9494650957	17,27,28,29,30,31,32,33,34,36

శానిటరి సూపర్‌వైజర్
సాంబయ్య 94946 50386 — 1నుంచి 60 డివిజన్ల పర్యవేక్షణా బాధ్యతలు

టైంస్కేల్ మంజూరీ చేయాలి

కూసుమంచి,నవంబరు28(ఆంధ్రజ్యోతి):కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్, సమగ్రశిక్షలో పని చేస్తున్న ఉద్యోగులు,ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, వర్కర్లు, అందరికి పోస్టుకు తగ్గ మినిమం వేతనం మంజూరీ చేయాలని యూటీఎఫ్ అధ్యక్షుడు చిలకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం కేజీబీవీలో భోజనవిరామం సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించాలని కేజీబీవీల్లో కేర్‌టేకర్లను నియమించాలని కోరారు. డైట్‌చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషలాఫీసర్ అజితకుమారి, యూటీఎఫ్ కార్యదర్శి మాండవ నర్సయ్య, సీఆర్‌టీలు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

మాదిగలకు ప్రాధాన్యత కలిపించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే నామినేటెడ్‌పోస్టుల్లో మాదిగలకు ప్రాధాన్యత కలిపించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ పేర్కొన్నారు ఈమేరకు గురువారం హైదరాబాదులోని గాంధీ భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో ఉన్న రెండు రిజర్వుడు నియోజకవర్గాల్లో ఎస్సీ మాల ఉపకులాలు కేటాయించారన్నారు. అయినప్పటికి మాదిగలు వారి గెలుపుకోసం కృషి చేశారన్నారు. ప్రభుత్వం త్వరలో నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో ఖమ్మం జిల్లాలో మాదిగలకు సముచిత స్థానం కలిపించాలన్నారు. ఈ మేరకు పదువులు కేటాయించి న్యాయం చేయాలని చంద్రశేఖర్ విన్నవించారు.

ఫైలేరియా బాధితులకు పింఛన్ పెంచాలి

తిరుమలాయపాలెం,నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు పించన్ పెంచాలని ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాలో పెద్దసంఖ్యంలో ఫైలేరియ వ్యాధిగ్రస్తులున్నారని వారికి నెలకు రూ.10వేలుపింఛన్ ఇవ్వాలని, ఉచితంగా మందులు, దోమతెరలు ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి కొత్తపింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, జి.వీరయ్య, రామచంద్రు, రఘుబాబు, రజిత, నాగమణి, నాగమ్మ, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

» సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు28(ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గంలోని అత్యధిక గ్రామాలు గిరిజన ప్రాంతం కావడంతో గతంలో అభివృద్ధికి నోచుకోలేదని వివరించారు. వైరాలో వందపడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి మరో రూ.వంద కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. వైరాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినందుకు సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ ఉన్నారు.

దీక్షా దివాస్‌ను జయప్రదం చేయండి

» మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నేడు ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించ తలపెట్టనున్న దీక్షా దివాస్‌ను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించన రోజును దీక్షా దివాస్‌గా జరుపుకుంటున్నామన్నారు. ఈ చారిత్రక రోజును మరోసారి గుర్తు చేసుకోవడానికి ఇందులో మనమంతా భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన తాజామాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరవ్వాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

వైరా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైరాలోని బ్రాహ్మణపల్లికి చెందిన బీడీఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్న వరుణ్‌శేఖర్‌కు రూ.ఆరువేలు ఆర్థిక సహాయాన్ని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్, కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు, కార్యదర్శి జె.పుల్లారావు, కోశాధికారి ఉయ్యూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో
గన్నీ సంచుల కొరత

» చినిగిన గన్నీసంచులతో రైతుల ఇబ్బందులు



తల్లాడలో కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం

తల్లాడ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీసంచుల కోసం రైతులు సొసైటీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గన్నీ సంచుల కోసం రోజుల తరబడి సొసైటీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. కొన్నిచోట్ల రైతులకు పంపిణీ చేసిన గన్నీసంచులు చినిగిపోయి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం సీజన్‌లో తల్లాడ మండలంలో 23,083ఎకరాల్లో వరిసాగు చేశారు. నెలరోజుల నుంచి ధాన్యం నూర్పిడిలు జరుగుతున్నాయి.

మండలంలో ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం 24కేంద్రాలను ప్రారంభించింది. తల్లాడ సొసైటీ పరిధిలో పినపాక, తల్లాడ, గొల్లగూడెం, అన్నారుగూడెం, కొత్తవెంకటగిరి, బిల్లుపాడు, గోపాలపేట, గంగదేవిపాడు సొసైటీ పరిధిలో నూతనకల్, రంగంబంజర, గూడూరు, అంజనాపురం, మిట్టపల్లి, నారయ్యబంజర, కుర్నవల్లి సొసైటీ పరిధిలో కుర్నవల్లి, కలకొడిమ సొసైటీ పరిధిలో లక్ష్మీపురం, కలకొడిమ, బస్వాపురం గ్రామాల్లో, ఐకేపీ ఆధ్వర్యంలో తెలగవరం, రామానుజవరం గ్రామాల్లో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు, నూతనకల్, తల్లాడ, అన్నారుగూడెం, కుర్నవల్లి, రామానుజవరం గ్రామాల్లో దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నూర్పిడైన 17శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని సంబంధిత ఏఈవోలు పరిశీలించి కూపన్ ఇచ్చిన దాన్ని బట్టి గన్నీసంచులు సొసైటీ అధికారులు రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా సొసైటీలకు సరిపడా గన్నీసంచులు సరఫరా కాకపోవడంతో వీటి కోసం సొసైటీ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగి పడిగాపులు కాయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. తల్లాడ సొసైటీ పరిధిలోని ఏడు కొనుగోలు కేంద్రాల పరిధిలోని సుమారు 14గ్రామాల రైతులు తల్లాడ సొసైటీ కార్యాలయానికి రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని రైతులు తెలిపారు. దీంతోపాటు మిగిలిన సొసైటీ కార్యాలయాలకు కూడా ఆయా గ్రామాల రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతు న్న తరుణంలో వదిలేసి తిరగాల్సి వస్తుందని రైతులు చెప్పారు.

ఐదురోజుల నుంచి తిరుగుతున్నా..

● దమ్మాలపాటి సత్యనారాయణ, రైతు, బిల్లుపాడు



పదెకరాల్లో సన్నరకం ధాన్యం పండించాను. నూర్పిడి అయింది. ఏఈవో తేమశాతాన్ని చూసి గన్నీసంచుల కోసం కూపన్ ఇచ్చారు. ఐదు రోజులుగా గన్నీసంచుల కోసం తల్లాడ సొసైటీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అయినప్పటికీ ఇంతవరకు గన్నీసంచులు నాకు అందలేదు.

గన్నీసంచులు సరఫరా చేయాలి

● దుగ్గినేని వెంకటేశ్వర్లు, రైతు, అన్నారుగూడెం



నాకున్న పొలంలో వరి సాగుచేశాను. నూర్పిడి చేసి ధాన్యాన్ని ఆరబెట్టాను. 17శాతం లోపు తేమ ఉంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్మేందుకు ఏఈవో పరిశీలించి కూపన్ ఇచ్చారు. రెండు రోజుల నుంచి ఇతర పనులు మానేసి గన్నీ సంచుల కోసం తిరుగుతున్నాను. ప్రభుత్వం గన్నీసంచులు సొసైటీలకు సరఫరా చేయాలి.

‘ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

బోనకల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రంగారావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో గురువారం జరిగిన ఆ సంఘ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ గావించిన వారికి 9 నెలలు గడుస్తున్నా ఇంతవరకు పింఛన్ అందక పోవడం బాధాకరమన్నారు. సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏల పై ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సూచించారు. నూతన ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ ఎంప్లాయ్ ఐడీ, ప్రాన్ నెంబర్లు కేటాయింపు జరిగేలా మండల నాయకులు చేసిన కృషి అభినందనీయంగా పేర్కొన్నారు. టీచర్ల సమస్యలను పరిష్కరించడంలో తమ సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటూ, నూతనంగా ఉద్యోగంలో చేరిన వారు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. రామ్మోహన్, ఎం. వెంకటేశ్వరరావు, ఆర్. బ్రహ్మారెడ్డి, కె. శ్రీనివాసరావు, రవి కుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఝాన్సీ, శారద, నర్సింహారావు, నాగేశ్వరరావు, తిరుపతిరావు, విద్యాసాగర్, పావని, మౌనిక పాల్గొన్నారు.

దెందుకూరు సీసీఐ కేంద్రం తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

మధిర రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు వద్దగల కనకదుర్గా జిన్నింగ్‌మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో అవకతవకలు అవకాశం లేకుండా ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రైతుల వద్దనుంచి పత్తి కొనుగోలు జరపాలన్నారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి కొనుగోలు తీరును అడిగి తెలుసుకున్నారు. తూకం, విక్రయం ధర, ఓటీపీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం మాటూరు వద్దగల అంతర్రాష్ట్ర చెక్ పోస్టును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో బి.వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రీ పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే అధికారులకు తెలపాలి

» జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



మర్లపాడులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

తల్లాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రంలో సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య సీసీఐ అధికారులను ఆదేశించారు. గురువారం తల్లాడ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లను ఉదయాన్నే ప్రారంభించాలని, ఎక్కువమంది రైతులు పత్తిని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినట్లయితే సాయంత్రం ఆరుగంటల తర్వాత కూడా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు అధికారుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాలన్నారు. మిగిలిన రైతులకు కూపన్లు ఇచ్చి మరుసటిరోజు వరుస క్రమంలో పత్తిని కొనుగోలు చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ బయ్యర్ ప్రదీప్‌సింగ్, జిన్నింగ్‌మిల్లు నిర్వాహకులు రాహుల్, సతీష్ పాల్గొన్నారు.

వేంసూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మర్లపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికే కాంటాలు వేసిన ధాన్యానికి సంబంధించి డబ్బులు పడాయా లేవా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సకాలంలో కాంటాలు వేసి మిల్లులకు ఎగుమతి చేయాలని సిబ్బందికి సూచించారు. ఏవో రామ్మోహన్‌రావు, సొసైటీ సీఈవోలు, యర్రా గోపి, కోలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ విజయచంద్ర

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

» మధిర ఏడీఏ విజయచంద్ర

ముదిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మధిర ఏడీఏ విజయచంద్ర ఆదేశించారు. గురువారం మేడేపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఇంతవరకు ఎంతమేర ధాన్యాన్ని కొనుగోలు చేశారని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ధాన్యం కొనుగోలు చేసి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో మౌనిక, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటనర్సయ్య ఆశయాలు సాధించాలి



వెంకటనర్సయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మువ్వా

కల్లూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల గ్రామంలో గురువారం రాజకీయ నాయకుడు హనుమంతు వెంకటనర్సయ్య సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఆయన దశదిన కార్యక్రమం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజచౌదరి, మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని రఘు, పోచారం సొసైటీ అధ్యకుడు నర్వనేని అంజయ్యలు, వెంకటనర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చదర్‌రావు, తక్కెళ్లపాటి ప్రసాద్, గణేష్‌చౌదరి, యాసా వెంకటేశ్వరరావు, గంగ్ర ఉపేంద్ర, మాదాల బుజ్జాయిలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

» డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

కొణిజర్ల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కాంగ్రెస్ కే సాధ్యమని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ సందీప్, ఏఈవో కుమార్‌రాజా, కొనుగోలు కేంద్రం సెంటర్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల ఖాతాల్లో వడ్లకు రూ.500 బోనస్ జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల పరిధిలోని వాచ్యానాయక్ తండలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వాచ్యానాయక్‌తండ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు బానోతు చందు నాయక్ ఆధ్వర్యంలో రైతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బానోతు భద్రు, రామ్లా, రాజు, సూర్య రాములు పాల్గొన్నారు.

లాలాపురంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొణిజర్ల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లాలాపురం గ్రామంలో గురువారం సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి సత్యనారాయణ, వైస్ చైర్మన్ నెల్లూరు రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సంక్రాంతి నర్సయ్య, కొమ్ము తిరుమలరావు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘నిత్యావసర సరుకులు అందించాలి’

వైరా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్న దృష్ట్యా రేషన్‌షాపుల ద్వారా 14రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని మాజీ ఎంపీపీ బొంతు సమత, ఐద్వా కార్యదర్శి తోట కృష్ణవేణి డిమాండ్ చేశారు. గురువారం వైరాలో జరిగిన ఐద్వా సమావేశంలో వారు మాట్లాడుతూ నిత్యావసర కూరగాయలు, పప్పులు, ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగాయని, వీటితోపాటు కల్తీ సరుకుల సరఫరా వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు మాడపాటి సుజాత, బేబీ, మణి, ఆశా, భానుమతి, సరోజిని పాల్గొన్నారు.

అంబటికి పరామర్శ

చింతకాని, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు వీరయ్య ఇటీవల మృతి చెందడంతో గురువారం దశదిన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వీరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, బండెల నాగార్జున, కూరపాటి కిషోర్, ఆలస్యం బస్వయ్య, నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం

బోనకల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు పంతు, సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్‌లు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే 134 వ ర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బందం శ్రీనివాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు నరేష్, ఉప్పర శ్రీను, ఇరుగు పుల్లారావు, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.



బోనకల్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొణిజర్ల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొణిజర్లలో గురువారం జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు యర్రాబాబు, తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పాషా, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా నాయకులు లాల్‌మియా, రైతుసంఘం నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, కృష్ణ, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్లలో...

వ్యాసరచన పోటీలు

ముదిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ జడ్పీఉన్నత పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమణయ్య విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పోటీ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యను పెంపొందించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో రమణయ్య

జిల్లాస్థాయి చెకుముకి సంబురాలు

ఖమ్మంటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేది ఆధ్వర్యంలో చెకుముకి సైన్సు సంబురాలను గురువారం నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాస్థాయి పోటీ పరీక్షలకు అన్ని మండలాల నుంచి 240మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియంలో మధిరలోని టీవీఎంజీ హెచ్ఎస్ (ప్రథమ), జడ్పీఎస్ఎస్ జల్లేపల్లి (ద్వితీ య), ఖమ్మంలోని ఎన్ఎస్ క్యాంపు పాఠశాల (తృతీయ) స్థానంలో నిలిచారు. ప్రభుత్వ తెలుగు మీడియంలో వేంసూరు మండలం అడసర్లపాడు జడ్పీఎస్ఎస్ పాఠశాల(ప్రథమ), మధిర మండలం మహదేవపురం జడ్పీఎస్ఎస్(ద్వితీయ), కొణిజర్ల మండలం గుబ్బగుర్తి జడ్పీఎస్ఎస్ పాఠశాల (తృతీయ) బహుమతులు సాధించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో పాలేరులోని జవహర్‌నవోదయ (ప్రథమ), వైరాలోని టీజీఆర్ఎస్ పాఠశాల బాలికలు (ద్వితీయ), కల్లూరులోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ (తృతీయ) బహుమతి గెలిచారు.

కారేపల్లి విద్యార్థుల ప్రతిభ

కారేపల్లి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో మండల కేంద్రానికి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మాలోత్ చక్రధర్, కల్లెపల్లి లాస్య, వాంకుడోత్ ప్రవళికలు తృతీయ స్థానాన్ని సాధించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

బీజేపీ కుటుంబ సభ్యుల వనసమారాధన



వనసమారాధనలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఎర్రుపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెంలో గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో కార్తీకమాస వనసమారాధన గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో కార్తీకమాసంలో అన్ని వర్గాల ప్రజలు కుటుంబసమేతంగా వనసమారాధన నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఎర్రుపాలెంలో నిలపుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, మండల అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావు, దేవరకొండ కోటేశ్వరరావు, గుండా చంద్రశేఖరరెడ్డి, కొండా గోపి, గడ్డం శ్రీహరి, స్వర్ణకర్, వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బంది నిరసన ప్రదర్శన

ముదిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట గురువారం తాత్కాలిక సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చాలీచాలని వేతనాలతో సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, జహీర్, కిషన్, రవికిరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొణిజర్ల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల సెంటర్ వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలం శాంతినగర్‌కు చెందిన నజీర్, తీగలబంజర గ్రామానికి చెందిన వాంకుడోతు కృష్ణ, పెద్దరాంపురం గ్రామానికి చెందిన నరేందర్ ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం వైపు వెళ్తున్నారు. తనికెళ్ల సెంటర్ వద్ద వారి వాహనాన్ని లారీ ఢీకొన్నట్లు బాధితులు తెలిపారు. అదే సమయంలో ఓ బస్సుకూడా ఆగి ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సూరజ్ సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్నామన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కారేపల్లి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన పలువురు పేద మహిళలకు జిల్లా మైనార్టీ నేత షేక్. గౌస్‌ద్దీన్ చీరెలు పంపిణీ చేశారు. గురువారం కాలనీలోని సుమారు వందమంది పేదమహిళలకు చీరలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఖాలీల్‌ఖాన్, సద్దాం, హుస్సేన్, షేక్. ఫిరోజ్‌అబ్దుల్లా, వాహెబ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆవుకు రెండు దూడల జననం

వేంసూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఒకే కాన్పులో ఒంగోలు జాతికి చెందిన ఆవుకు రెండు దూడలు జన్మించిన సంఘటన వేంసూరు మండలం రామన్నపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. మాజీ ఎంపీటీసీ పుచ్చకాయల లక్ష్మీ, శంకర్‌రెడ్డిలకు చెంది న ఆవు సోమవారం ఒకే కాన్పు లో ఆడ, మగ దూడలకు జన్మనిచ్చింది.



ఒకే కాన్పులో రెండు దూడలకు జన్మనిచ్చిన ఒంగోలు జాతికి చెందిన ఆవు

వైభవంగా రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

తల్లాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని గంగాపార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామివారికి రుద్రాక్షలు, అన్నంతో అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మణికంఠశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

వైరా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైరా ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. మిట్టపల్లి నాగేశ్వరరావు, అరుణ దంపతుల కుమార్తె స్వాతి రామకృష్ణ పెళ్లిరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్రరావు, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చింతలపూడి వెంకటేశ్వరరావు, అబ్బూరి రమేష్, సభ్యులు చింతోజు నాగేశ్వరరావు, మిట్టపల్లి శివ, నాగభూషణం, వెంకటరమణ, బుచ్చి రామారావు పాల్గొన్నారు.